

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులతో పూర్వ ఉపాధ్యాయులు

ఘనంగా పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చాదర్‌ఘాట్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మూసారాంబాగ్‌లోని స్వామి వివేకానంద సెంటీనరీ హైస్కూల్‌కు చెందిన 1995,1997 బ్యాచ్ పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా అప్పట్లో వీరికి విద్యాబోధనలు చేసిన ప్రస్తుత పూర్వ ఉపాధ్యాయులు వెంకటరమణ, శాంతా ప్రసాద్‌రావు, తాళ్లపల్లి చక్రపాణి, లక్ష్మణ్‌రావు, సంతోష్‌కుమార్‌లను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. అప్పట్లో స్కూల్‌లో చేసిన అల్లరి చేష్టలు, తీపి కబుర్లను గుర్తు చేసుకుని ఆనందాన్ని పంచుకున్నారు. ఉపాధ్యాయులు బోధనలు చేసే తీరును, వారు కొట్టిన దెబ్బలను కూడా గుర్తు చేసుకున్నారు. 1995 బ్యాచ్‌కు చెందిన రామలింగేశ్వరరావు, అశ్వినికుమార్, సురేష్, రాజవర్ధన్‌రెడ్డి, వెంకటరాయుడు, సంపూర్ణ, 1997 బ్యాచ్‌కు చెందిన బోనగిరి చంద్రశేఖర్, డాక్టర్ రోహిణీకుమార్, రాఘవేంద్ర, రమేష్‌గౌడ్, స్వాతి, బసంతి, మధుకర్, కిరణ్, శంకర్, మధుసూదన్‌రెడ్డి, జేబీఎస్ కుమార్ పాల్గొని పూర్వ ఉపాధ్యాయుల ఆశీర్వాదాలు పొందారు.



తన తల్లి పేరుతో ఓ మొక్కను నాటుతున్న చింతల సురేంద్రనాథ్‌యాదవ్

గాలి, నీటి స్వచ్ఛతకు చెట్లు దోహదం

మన్సూరాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): పీల్చే గాలి, తాగే నీరు స్వచ్ఛతకు చెట్లు ఎంతగానో దోహదపడతాయని, ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి గాలి, నీరు కలుషితం కాకుండా చూడాలని ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు 'అమ్మ పేరుతో ఓ మొక్క' కార్యక్రమంలో భాగంగా ఆదివారం నాగోల్ డివిజన్ సహదేవ్‌సింగ్‌నగర్‌లో బీజేపీ నాయకులు, కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవకోటి మనుగడకు మూలం మొక్కలే ఆధారమని, చెట్లు ఉంటేనే జీవకోటికి ఆయుష్షు ఉంటుందన్నారు. కాలనీ అసోసియేషన్ సభ్యులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

చైతన్యనగర్‌కాలనీ సంక్షేమ సంఘం కమిటీ ఏకగ్రీవం



సంజీవరెడ్డి

వనస్థలిపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ చైతన్యనగర్‌కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా జిట్టా సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పున్న యాదయ్య, ఆర్థిక కార్యదర్శిగా చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా నందికొండ వెంకట్‌రెడ్డి, ఎం.వినోద్, సహాయ కార్యదర్శులుగా కళ్లెం చంద్రశేఖర్‌రెడ్డి, శివరాజ్, సాంస్కృతిక కార్యదర్శిగా ఎం.భూపాల్‌రెడ్డి, సలహాదారులుగా ఆర్.జనార్దన్‌రెడ్డి, కేసరి మోహన్‌రెడ్డి, లీగల్ అడ్వైజర్‌గా ఆర్.కిరణ్‌కుమార్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తమ నియామకానికి కృషి చేసిన కాలనీవాసులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

జనప్రియకాలనీ సంక్షేమ సంఘం కమిటీ..



పవన్‌కుమార్‌గుప్తా

వనస్థలిపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వనస్థలిపురం డివిజన్ జనప్రియకాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా సోమ పవన్‌కుమార్‌గుప్తా, ప్రధాన కార్యదర్శిగా సురేంద్ర, ఉపాధ్యక్షులుగా కె.విఠల్‌రావు, వి.దుర్గాప్రసాద్ రావు, ఆర్థిక కార్యదర్శిగా ఎన్.వినయ్‌కుమార్, సహాయ కార్యదర్శిగా వెంకటనవీన్ దాసరి, సీహెచ్.వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఎస్ఎస్ఆర్ఎన్‌వీఎంశాస్త్రీ, ఎం.వనజారెడ్డి, సలహాదారులుగా ఎన్.బ్రహ్మాచారి, సభ్యులుగా సీ.దుర్గాప్రసాద్, డి.సాంబశివరావు, రాములు, వెంకటేష్ కులకర్ణి, వినోద్ దేశ్‌పాండే, వి.సంపత్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. తమ నియామకానికి కృషిచేసిన కాలనీవాసులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

బీజేపీ జిల్లా కార్యాలయ కార్యదర్శిగా అమరేశ్వర్



అమరేశ్వర్‌ముదిరాజ్

మన్సూరాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యాలయ కార్యదర్శిగా మన్సూరాబాద్ డివిజన్ సెంట్రల్‌బ్యాంక్ కాలనీకి చెందిన ఎడ్ల అమరేశ్వర్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపు పత్రాన్ని జిల్లా పార్టీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా అమరేశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు, ఎంపీ ఈటల రాజేందర్, వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, వంగ మధుసూదన్‌రెడ్డి, కళ్లెం రవీందర్‌రెడ్డి, మునగాల హరీష్‌రెడ్డి, ఇతర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి బాలాజీ కోవెల పవిత్రోత్సవాలు

- మూడు రోజుల పాటు నిర్వహణ



జిల్లెలగూడ బాలాజీ కోవెల

సరూర్‌నగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గల మత్స్యావతార శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో నేటి నుంచి స్వామి వారి సప్తమ పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఫౌండర్ ట్రస్టీ రాజా సంజయ్‌గోపాల్ సైంచర్, ఈవో వై.శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేసినట్టు వారు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజైన సోమవారం సాయంత్రం 5.30గంటల నుంచి రాత్రి పది గంటల వరకు శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచనం, అంకురారోపణ, రుత్విగరణం, శాత్తుమర్రై తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. రెండో రోజైన మంగళవారం ఉదయం 6గంటలకు ఆరాధన, సేవాకాలం, బాలభోగం, 8గంటలకు రుక్మిణీసమేత వేణుగోపాల స్వామి నవకలశ అభిషేకం, శ్రీఆంజనేయస్వామి వారి నవకలశ అభిషేకం, 9గంటలకు యాగశాలలో శాంతిపాఠం, ద్వారతోరణ ధ్వజకుంభారాధన, మూర్తి కుంభారాధన, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర అధివాసం, నిత్య పూర్ణాహుతి తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఇక చివరి రోజైన బుధవారం ఉదయం 6గంటలకు ఆరాధన, సేవాకాలం, బాలభోగం, శాత్తుమర్రై, 8గంటలకు శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వస్వామి వారి పంచవింశతి కలశ అభిషేకం, మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, పవిత్రావరోహణం, రుత్విక్ సన్మానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని వారు కోరారు. ఇతర వివరాలకు ఆలయంలో సంప్రదించాల్సిందిగా సూచించారు.

అలరిస్తున్న అంతర్‌గంగా వాటర్‌ఫాల్స్

- వరుసగా కురుస్తున్న వర్షాలతో వాటర్‌ఫాల్స్‌ను చూసేందుకు తరలివస్తున్న పర్యాటకులు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): వరుసగా కురుస్తున్న వర్షాలతో హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లిలోని అంతర్‌గంగా వాటర్ ఫాల్స్ పర్యాటకులను ఆకర్షిస్తూ అలరిస్తుంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలతో అంతర్‌గంగా వాటర్ ఫాల్స్ పర్యాటకులను కనువిందుచేస్తోంది. దీంతో నగరంతో పాటు శివారు గ్రామాల నుంచి పర్యాటకులు పెద్ద ఎత్తున వాటర్ ఫాల్స్‌ను సందర్శిస్తున్నారు. హైదరాబాద్ నగరానికి కేవలం 20కిలోమీటర్ల దూరం మాత్రమే ఉండడంతో పర్యాటకులు పెద్ద ఎత్తున కుటుంబ సభ్యులతో తరలివస్తున్నారు. ఎత్తయిన గుట్టలపై నుంచి జాలువారుతున్న నీటితో షవర్ స్నానాలు చేస్తూ పర్యాటకులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. ప్రేమికులు, స్నేహితులు, ఫ్యామిలీ సభ్యులు పెద్ద సంఖ్యలో అంతర్‌గంగా ఫాల్స్‌ను సందర్శించి ఆనంద పరవశం పొందుతున్నారు. హైదరాబాద్‌కు అత్యంత సమీపంలో ఉన్న ఈ వాటర్ ఫాల్స్‌పై ప్రభుత్వం దృష్టి పెడితే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉన్నదని పర్యాటకులు సూచిస్తున్నారు.



వాటర్‌ఫాల్స్ వద్ద సందడి చేస్తున్న చిన్నారులు, యువతి, యువకులు



వాటర్‌ఫాల్స్ గుట్టరాళ్లపై సందడి చేస్తున్న కుటుంబ సభ్యులు

సమతాపురిలో 63 అడుగుల మట్టి గణపతి

- మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేయండి : మధుయాష్కీగౌడ్

కొత్తపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్ పరిధిలోని సమతాపురిలో 63 అడుగుల మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక తిరంగా యూత్ అసోసియేషన్ 19 సంవత్సరాలుగా మట్టి గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు.

విషయం తెలుసుకున్న టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఆదివారం సమతాపురిలో తయారీలో ఉన్న ఈ 63 అడుగుల మట్టి గణపతిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకచవితి ఉత్సవాలకు పర్యావరణహిత మట్టి గణపతి విగ్రహాలను ఏర్పాటు చేయాలని సూచించారు. తిరంగా యూత్ అసోసియేషన్ వారిని ఆయన అభినందించారు. ప్రకృతిని, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్‌గౌడ్, నాయకులు కొండోజు శ్రీనివాస్, దాము మహేందర్‌యాదవ్, రమేష్, నాగార్జునరెడ్డి, తిరంగా యూత్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



మట్టి గణపతి వద్ద మధుయాష్కీగౌడ్ తదితరులు

గణేశ్ ఉత్సవాలకు ప్రజలు సహకరించాలి : అడిషనల్ డీసీపీ

చంపాపేట, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే గణేశ్ ఉత్సవాలకు ప్రజలందరూ సహకరించాలని ఎల్బీనగర్ అడిషనల్ డీసీపీ కోటేశ్వర్‌రావు కోరారు. హస్తినాపురం డివిజన్‌లోని జడ్పీ రోడ్డులోని పూజా బంకెట్‌హాల్‌లో ఆదివారం భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ కమిటీ డివిజన్ కన్వీనర్ రాఘవేందర్‌యాదవ్ ఆధ్వర్యంలో మండపాల నిర్వాహకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి రావినూతల శశిధర్, అడిషనల్ డీసీపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు సాగనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి మండపంలో శుభ్రతతో పాటు శాంతి భద్రతలకు ప్రాధాన్యం ఇవ్వాలని మండప నిర్వాహకులను కోరారు. రావినూతల శశిధర్ మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలను భక్తి, శాంతి, సామరస్యంతో నిర్వహించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. ప్రతి మండపం నిర్వాహకులు భద్రతా నియమాలను ఖచ్చితంగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎస్‌హెచ్‌వో వినోద్‌కుమార్, భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కన్వీనర్ నవీన్‌కుమార్, కో-కన్వీనర్ నరేష్ యాదవ్, బ్రహ్మాచారి పాల్గొన్నారు.



గణేశ్ మండప నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్

విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

- అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథం

వనస్థలిపురం, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథం అన్నారు. ఈ మేరకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ విశ్వకర్మలకు ప్రత్యేక కార్పొరేషన్ లేకపోవడంతో విశ్వకర్మలు అభివృద్ధిలో వెనుకబడుతున్నారన్నారు. అదేవిధంగా ఉప్పల్ భాగయత్‌లో విశ్వకర్మల ఆత్మగౌరవ ట్రస్ట్ కమిటీ విస్తరణలో భాగంగా జిల్లా, మండల, గ్రామస్థాయి సభ్యులను భాగస్వాములుగా చేయాలన్నారు. సెప్టెంబర్ 17న జరిగే విశ్వకర్మ యజ్ఞానికి తప్పనిసరిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రామచందర్‌రావు తెలిపారని జగన్నాథం పేర్కొన్నారు. కార్యక్రమంలో అఖిల భారత విశ్వకర్మ మహాసభ ప్రధాన కార్యదర్శి సంకోజు లింగాచారి, అవంచ మురళీధర్‌చారి, ఇంద్రాల అశ్విని, ఇందిర, పి.జయశ్రీ పాల్గొన్నారు.



రామచందర్‌రావుకు వినతిపత్రం ఇస్తున్న కౌలే జగన్నాథం



శిబిరానికి ఎంపికైన క్రీడాకారులు

'వోక్సెన్'లో బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ చాంపియన్‌షిప్ కోసం తెలంగాణ యువ క్రీడాకారులను సన్నద్ధం చేసేందుకు నగరంలోని వోక్సెన్ విశ్వవిద్యాలయంలో బాస్కెట్‌బాల్ రాష్ట్ర స్థాయి శిక్షణా శిబిరాన్ని తెలంగాణ బాస్కెట్‌బాల్ సంఘం (టీబీఏ) నిర్వహిస్తోంది. ఈనెల 30వ తేదీ వరకు ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్టు టీబీఏ కార్యదర్శి పృథీశ్వర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జరిగిన ట్రయల్స్‌లో ప్రతిభావంతులైన 25 మంది అమ్మాయిలు, 24 మంది అబ్బాయిలను శిబిరానికి ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులను వోక్సెన్ విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు డాక్టర్ రౌల్ వి.రోడ్రిగేజ్ అభినందించారు.

మీర్‌పేట్‌లో శ్రావణమాస కుంకుమార్చన

సరూర్‌నగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని శివసాయినగర్‌కాలనీలో గల శ్రీగౌరీ నీలకంఠేశ్వరస్వామి సమేత శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో ఆలయ కమిటీ, శ్రీగాయత్రీ సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యం లో శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో స్థానిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అభిషేకం, అర్చన, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ ప్రతినిధులు సంతోష్‌రెడ్డి, వెంకటకృష్ణారావు, అన్నాజీరావు, వెంకటరమణ, శ్రీగాయత్రీ సేవా సంఘం ప్రతినిధులు శ్రీనివాసప్రసాద్, లక్ష్మణరావు, ఎల్ఎస్ మూర్తి, ఆకెళ్ల మూర్తి, వంశీకృష్ణ, బాపిరాజు, భీమ శంకరం, తాండవ కృష్ణమూర్తి, విశ్వనాథబాబు, శ్రీనివాస ఆంజనేయ శాస్త్రి, అప్పయ్యశాస్త్రి, ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మీ గణపతిరావు పాల్గొన్నారు.



కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు


ఘనంగా తీజ్ పండుగ

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పంచాయతీ పరిధిలోని జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఆదివారం తీజ్ పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, అబ్దుల్లాపూర్‌మెట్ మాజీ ఎంపీటీసీ తాటిపల్లి సౌమ్యరమేష్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీలోని సేవాలాల్ మహరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక లంబాడీలు పాల్గొన్నారు.

క్రైస్తవ శ్మశానవాటికలకు నిర్వహణ కమిటీలు నియమించాలి

- ప్రభుత్వం కేటాయించిన స్థలాలను వినియోగంలోకి తేవాలి
- క్రైస్తవ సంఘాల డిమాండ్

సరూర్‌నగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో క్రైస్తవుల సమాధుల(శ్మశానవాటికల) కోసం కేటాయించిన స్థలాలను వెంటనే వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆయా స్థలాలకు నిర్వహణ కమిటీలను నియమించి, వాటిని వారికి అప్పగించాలని కోరారు. ఆదివారం మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలిండియా దళిత క్రైస్తవ సంఘ సమాఖ్య అధ్యక్షుడు జెరూసలేం మత్తయ్య మాట్లాడుతూ జిల్లాలోని ఫరూఖ్‌నగర్ మండలం చౌలపల్లిలో 3.20ఎకరాలు, ఇబ్రహీంపట్నం మండలం ఖల్సాలో 5ఎకరాలు, మహేశ్వరం మండలంలోని గంగారం గ్రామంలో 10ఎకరాలు, కొత్తూరు మండలంలోని కొడిచెర్ల గ్రామంలో 2.20ఎకరాలను క్రైస్తవుల సమాధుల కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2019, 2020లో కేటాయించిందని పేర్కొన్నారు. అయితే వాటిని తమకు అప్పగించకపోవడంతో క్రైస్తవులు మరణించినప్పుడు అంత్యక్రియలకు తిప్పలు తప్పడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానవాటికలకు అధికారికంగా నిర్వహణ కమిటీలు ఏర్పాటు చేసి, సదరు కమిటీలకు స్థలాలను అప్పగించి వాటిని వినియోగంలోకి తేవడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. 2020లో కరోనా సమయంలో తాత్కాలికంగా బాలాపూర్ మండలంలోని కుర్మల్‌గూడలో తమకు 2ఎకరాల స్థలం కేటాయించారని, అయితే అనంతరం సదరు కేటాయింపును అర్థాంతరంగా రద్దు చేశారని మత్తయ్య పేర్కొన్నారు. దీనిపై తాము హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుని మళ్లీ అక్కడే ఖననం చేస్తున్నామని, అయితే రెండెకరాల స్థలం సమాధులతో నిండిపోవడంతో అసౌకర్యం ఏర్పడుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దృష్ట్యా ప్రభుత్వం, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి, కాంగ్రెస్ ఇన్‌చార్జి కేఎల్లార్ తదితరులు తమ ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని ఫరూఖ్‌నగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కొత్తూరు మండలాల్లో కేటాయించిన స్థలాలను వెంటనే వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



శ్మశానవాటికలకు స్థలం కేటాయింపు ఉత్తర్వులను చూపుతున్న మత్తయ్య



మధురాపురికాలనీలో సమస్యను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మధురాపురికాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే

ఎల్బీనగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మధురాపురికాలనీలో సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవానీ ప్రవీణ్‌తో కలిసి ఆయన మధురాపురికాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక వర్తకులు డ్రైనేజీవ్యవస్థ సరిగా లేక మురుగునీరు పొంగిపొర్లుతున్నదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. రోడ్డు వేస్తామని చెప్పి రోడ్డు తవ్వి 45రోజులు గడిచిందన్నారు. దీంతో తాము వ్యాపారాలు చేసుకోలేకపోతున్నామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే జలమండలి, జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ఇక్కడ నిత్యం తక్షణమే డ్రైనేజీ సమస్యను పరిష్కరించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గడ్డిఅన్నారం డివిజన్ అధ్యక్షుడు శ్రీశైలంయాదవ్, రవిచారి, సుధీర్‌గౌడ్, విక్కీ, ప్రదీప్, విజయ్, సాయినాథ్, సాయికిరణ్, లక్ష్మణ్, కృష్ణ, వర్షిత్, భాస్కర్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం : ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

ఎల్బీనగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని మధురాపురికాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులు చేపడతామని కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మధురాపురికాలనీలో జలమండలి అధికారులతో కలిసి పర్యటించిన ఆయన అక్కడి డ్రైనేజీ సమస్యను పరిశీలించారు. కాలనీలో వ్యాపార సముదాయాలు, హాస్టళ్లు ఎక్కువగా ఉండడం వల్ల తరచూ డ్రైనేజీ సమస్య తలెత్తుతున్నదన్నారు. డ్రైనేజీ సమస్యతో దుర్వాసన వస్తున్నదని రాకపోకలకు ఇబ్బంది ఏర్పడుతుందని స్థానికులు కార్పొరేటర్‌కు వివరించారు. డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపి రోడ్డు పనులు కూడా చేపట్టేలా చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులతో పాటు స్థానిక వ్యాపారులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ

హయత్‌నగర్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ తొర్రూర్ గ్రామంలో నాభిశిల ప్రతిష్ఠ, ఎల్లమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో నిర్వహించిన హోమంలో రాష్ట్ర రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి దంపతులు కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

మాదన్నపేటలో ఘనంగా బోనాలు

సైదాబాద్, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): మాదన్నపేట మండిలో ఆదివారం భూలక్ష్మి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాల సంబరాలు ఘనంగా జరిగాయి. శివసత్తులు, పోతురాజుల నృత్యాలు, డప్పు వాయిద్యాల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించారు. ముందు జాగ్రత్త చర్యలో భాగంగా మండీలో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. అమ్మవారిని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రేడర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మల్లారెడ్డి, హన్మంతరెడ్డి తెలిపారు. సోమవారం అమ్మవారి రథోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆత్మీయ బోధనలు .. తరలివచ్చిన క్రైస్తవులు

బర్కత్‌పుర, ఆగస్టు 17(ఆంధ్రజ్యోతి): లార్డ్ చర్చ్ పాస్టర్ రాజ్‌ప్రకాష్ పాల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నగరంలోని ఎల్బీ స్టేడియంలో పశ్చాత్తాప సమావేశాల పేరుతో నిర్వహించిన సభలు ఆదివారం ముగిశాయి. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి మూడు రోజుల పాటు వేలాది మంది క్రైస్తవులు హాజరయ్యారు. ఈసందర్భంగా పాస్టర్ రాజ్‌ప్రకాష్‌పాల్, సిస్టర్ జెస్సీ పాల్ క్రైస్తవులకు ఆత్మీయ బోధనలు అందించారు. క్రైస్తవులు ఆత్మీయ జీవితంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా ధైర్యంతో యేసు క్రీస్తుపై నిరీక్షణతో ముందుకు సాగాలని సూచించారు. ఈసందర్భంగా దేశానికి, రాష్ట్రానికి అన్ని విధాలుగా మంచి జరగాలని, ప్రజలందరూ సుఖ శాంతులతో ఉండాలని ప్రత్యేక ఉపవాస ప్రార్థనలు చేశారు.

అన్ని ఎన్నికల్లోనూ పోటీ చేస్తాం

- రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షుడు యశ్వంత్ అంబేడ్కర్

పంజాగుట్ట, ఆగస్టు17 (ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్తంగా జరిగే అన్ని ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించాలని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (భీమ్‌రావు అంబేడ్కర్) జాతీయ అధ్యక్షుడు, అంబేడ్కర్ మనవడు డాక్టర్ భీమ్‌రావు యశ్వంత్ అంబేడ్కర్ అన్నారు. ఈవీఎంలకు వ్యతిరేకంగా ఇండియా కూటమి, కలిసి వచ్చే పార్టీలతో కలిసి ఈ నెల 19న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా చేపడుతున్నామని ఆయన తెలిపారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్‌ను, ఇతర కార్యవర్గాన్ని ప్రకటించి, వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మైనార్టీల పక్షాన నిలబడే పార్టీ ఏదీ లేదని, ఒక్క తమ పార్టీ మాత్రమే వారి పక్షాన నిలబడి సమస్యలపై పోరాడుతుందన్నారు. దక్షిణాదిలో తమ పార్టీ అడుగుపెడుతోందని, తమిళనాడులో అక్కడ అధికారంలో ఉన్న పార్టీతోను, మిగతా రాష్ట్రాలలో తమతో కలిసి వచ్చే పార్టీలతో పనిచేస్తామని అన్నారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామని, రాబోయే అన్ని ఎన్నికలలో పోటీ చేస్తామని స్పష్టం చేశారు. జిల్లాలలో రథయాత్ర, జీహెచ్ఎంసీలో పాదయాత్రలు చేపడుతామని గాలి వినోద్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గవ్వల శ్రీకాంత్, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ ముబాషీర్, డాక్టర్ అర్చన, దుర్గం లచ్చయ్య, కోశాధికారిగా మురళి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా డాక్టర్ వనజ, ఉద్యోగుల విభాగం అధ్యక్షుడిగా కె.మల్లయ్య, ముస్లిం వింగ్ అధ్యక్షుడిగా సయ్యద్ ఎజాజ్ హుస్సేన్, యూత్ వింగ్ అధ్యక్షుడిగా ఎండీ అక్బర్ అలీ, తదితరులు నియమితులయ్యారు. వీరితో పాటు ఏడు జిల్లాలకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను నియమించారు. ఈ సమావేశంలో పార్టీ తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జి డాక్టర్ చంద్రకాంత్, ఏపీ అధ్యక్షుడు యు.దేవీప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.